సాగుతోంది.. ఆక్రమణల పర్వం



◆ ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జా.. ఇష్టారాజ్యంగా పంటలు
◆ న్యాయం చేయాలని కోరుతున్న గ్రామస్థులు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మారినా కబ్జాదారుల ఆక్రమణలు దర్జాగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో ఆక్రమించుకున్న భూములను కాపాడుకోవడానికి కొందరు వైకాపాకు చెందిన కబ్జాదారులు కూటమి నేతల పంచన చేరి పైరవీలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. అవి ప్రభుత్వ భూములని అధికారులు నిగ్గుతేల్చినా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కూటమి నేతలు అడ్డుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

కార్వేటినగరం మండలంలోని గంగమాంబపురంలో గతంలో వైకాపాకు చెందిన నాయకుడు సర్వే నంబరు 202-5లో 3.78 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నాడు. ఈ భూమిలో గ్రామస్థులు కర్మక్రియలు నిర్వహించడంతో పాటు కొంత భూమిలో తిరుపతి గంగమ్మకు పొంగళ్లు పెట్టేవారు. ఈ భూమికి పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. పాఠశాలకు క్రీడా మైదానం కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 2001లో గ్రామంలోని పేదలకు ఈ భూమిలో 14మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇళ్లు కట్టుకోనీయకుండా వైకాపా నాయకుడు అడ్డుకుని బెదిరించడంతో వారు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. గ్రామానికి సమీపంలోని విలువైన భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. దీనిపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సర్వేచేసి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డును ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ పట్టించుకోని కబ్జాదారుడు ఆ భూమిలోనే సాగు చేస్తున్నాడు. ప్రభుత్వం మారడంతో తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితంలేదు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ భూమిని సమగ్ర సర్వే చేయించి ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం..

గంగమాంబపురంలోని 202-5 సర్వే నంబరులో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు గతంలో సర్వే చేసి బోర్డు ఏర్పాటు చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– భగవతి, తహసీల్దార్, కార్వేటినగరం

పేదలకు ఇళ్ల పట్టాలు కేటాయించాలి..



గంగమాంబపురంలోని సర్వే నంబరు 202-5లో 2001లో ప్రభుత్వం మాకు పట్టాలు ఇచ్చింది. ఈ భూమిని ఆక్రమించిన కబ్జాదారుడు మమ్మల్ని ఇళ్లు కట్టనీయకుండా అడ్డుకున్నాడు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు చెందేలా చర్యలు తీసుకోవాలి.
–కందయ్యబోయుడు, గంగమాంబపురం

ప్రభుత్వ భూమి గ్రామానికి కేటాయించాలి..



గంగమాంబపురంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని గ్రామంలో కర్మక్రియల నిర్వహణకు, గంగమ్మకు పొంగళ్లు పెట్టుకోవడానికి, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించాలి. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూమిని సమగ్ర సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి.
–చంద్రమోహన్‌రెడ్డి, గంగమాంబపురం

బారులు తీరి.. పరిష్కారానికి వినతులిచ్చి

కలెక్టర్ ఎదుట మొరపెట్టుకున్న బాధితులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: నా కుమారుడికి పింఛను రావడం లేదని.. రీ సర్వే ద్వారా భూ విస్తీర్ణం తగ్గిందని బాధితులు కలెక్టర్ ఎదుట మొర పెట్టుకున్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలంటూ వినతులతో బారులు తీరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని జిల్లా పాలనాధికారి సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 117 వినతులు అందాయి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. బీఆర్ సురేష్‌బాబు, ఆర్డీవో శ్రీనివాసరాజు, పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, డీఎస్పీ పార్థసారథి పాల్గొన్నారు.

సదరం ధ్రువపత్రం మంజూరు కాక



నా కుమారుడు కోమల్(7) చిన్నతనంలో అనారోగ్యానికి గురికావడంతో అంగవైకల్యం వచ్చింది. సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే ఇతర ప్రాంతంలోని శిబిరానికి వెళ్లాలని చెబుతున్నారు. చిత్తూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. - సౌందర్య, తంబిగానిపల్లె

పింఛన్ మంజూరు చేయండి



నేను 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నా. పింఛన్ కోసం రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నాకు సంపూర్ణ అంగవైకల్యం పింఛన్ మంజూరు చేయించాలి. - సుబ్రహ్మణ్యం, చెక్కునత్తం, కుప్పం

భూమి దున్నేందుకు వెళ్తే దౌర్జన్యం చేస్తున్నారు



గుడుపల్లె మండలం సజ్జలపల్లె గ్రామ రెవెన్యూలో సర్వే నం.33-5లో ఎ.1.19 సెంట్లు, సర్వే నం.33-1లో ఎ.0.65 సెంట్ల భూమి కొనుగోలు చేశా. రీసర్వే చేయడంతో ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో విస్తీర్ణం తగ్గింది. ఈ విషయమై పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశా. ఇప్పుడు ఆ భూమిలో వ్యవసాయం చేసేందుకు వెళ్తే కొందరు దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులు విచారణ జరపాలి. - సుబ్రహ్మణ్యం, కమతమూరు

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: ఎటువంటి దర్శన టికెట్లు లేకుండా గురువారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 77,939 మంది దర్శించుకున్నారు. రూ.3.50 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఇంజినీర్ల బదిలీ

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల బదిలీలు పూర్తయ్యాయి. పంచాయతీరాజ్ శాఖలోని పీఆర్ఐ డీఈఈల బదిలీ ప్రక్రియ జరిగింది. చిత్తూరుకు నవీన్‌కుమార్, పూతలపట్టుకు అనిత, పలమనేరుకు మహేష్ బదిలీ కాగా.. పూతలపట్టు పీఐయూ డీఈఈగా నరసింహప్రసాద్‌ను నియమించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో డీఈఈల బదిలీలో.. చిత్తూరుకు శ్రీనివాసులు, పూతలపట్టుకు రవికిరణ్, కార్వేటినగరానికి సతీష్, నగరికి శ్రీహరి, పలమనేరుకు స్టాలిన్‌ను నియమించారు. వీరందరూ ఒకట్రెండ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలోని గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకుల్లో 220మంది బదిలీ అయ్యారు.



నృత్యాభినయం

తెప్పోత్సవానికి సిద్ధమైన వరసిద్ధుడి పుష్కరిణి



పుష్పాలంకృతులైన విఘ్ననాథుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా పదో రోజైన గురువారం రాత్రి పూలంగిసేవను పురస్కరించుకుని సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి స్వామివారు పుష్పాలంకృతులై భక్తులను కనువిందు చేశారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. ఈవో పి.గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, కాణిపాకం సర్పంచి కేవీస్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం..

ప్రత్యేకోత్సవాల్లో ఆఖరి రోజున శుక్రవారం రాత్రి స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారిని ఆలయ పవిత్ర పుష్కరిణిలో ప్రదక్షిణ చేయిస్తారు. ఇందుకు పుష్కరిణిని అలంకరిస్తున్నారు. స్వామివారికి మహా ప్రసాదమైన 21 కిలోల లడ్డూను పుష్కరిణి వద్ద వేలం వేయనున్నట్లు ఈవో ఎగురుప్రసాద్ తెలిపారు.



పూలగింసేవలో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి


చిత్తూరు ఆర్డీవోగా శ్రీనివాసులు.. పలమనేరుకు వెంకటేష్

ఈనాడు, చిత్తూరు: చిత్తూరు ఆర్డీవోగా ఎం.శ్రీనివాసులు, పలమనేరు ఆర్డీవోగా వెంకటేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఎం.శ్రీనివాసులు తెలుగుగంగ ప్రాజెక్టు రాపూరు యూనిట్‌లో పనిచేస్తున్నారు. వెంకటేష్.. పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ వద్ద ఓఎస్డీగా ఉంటూ బదిలీపై పలమనేరుకు వస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు విధులు నిర్వర్తిస్తున్న చిన్నయ్యను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. పలమనేరులో పనిచేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డిని కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించింది. ఇటీవల వరకు జడ్పీ సీఈవోగా విధులు నిర్వర్తించిన గ్లోరియాకు బాపట్ల ఆర్డీవోగా బాధ్యతలు ఇచ్చారు.

డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీగా రవికుమార్‌నాయుడు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీగా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడికి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పీడీగా ఉన్న తులసీని ఆమె మాతృశాఖ వాణిజ్య పన్నులశాఖకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జి పీడీగా సీఈవోను నియమించారు.

నీటి సమస్య పరిష్కరించాలని మహిళల నిరసన



కుప్పిగానిపల్లె గ్రామ సచివాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

కుపిగానిపల్లె(గుడుపల్లె), న్యూస్‌టుడే: పంచాయతీలో నిధులున్నా నీటి ఎద్దడి నివారించే పనుల్లో నిర్లక్ష్యం కారణంగా నెల రోజులుగా నానా అవస్థలు పడుతున్నామంటూ కుప్పిగానిపల్లెలో ఖాళీ బిందెలతో మహిళలు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామ సచివాలయం అధికారులు, సర్పంచి సైతం సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని వాపోయారు. గ్రామంలో మూడు తాగునీటి బోరు బావులు, ట్యాంకులున్నా నీరు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో తాజ్‌మస్రూర్ కుప్పిగానిపల్లెకు చేరకుని ఒక్కరోజులో సమస్య పరిష్కరిస్తానంటూ భరోసా ఇవ్వడంతో నిరసన విరమించారు.

కోర్సులు లేకనే రూ.కోట్లలో చెల్లింపులు

◆ ఐదేళ్లలో అభ్యసన సామగ్రికి లెక్కాపద్దు
◆ ఎస్వీయూ దూరవిద్య విభాగం తీరిది

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: అక్కడ ప్రవేశాలు లేవు.. అప్పటికే కోర్సుల్లో చేరిన కొందరికి పరీక్షలు జరగనే లేదు.. పేరుకే తరగతులు తప్ప.. వాటి ఆచూకీ కనిపించిన దాఖలాలు లేవు.. ఆ తర్వాత ఆ కోర్సులు రద్దయినా స్టడీ మెటీరియల్ ఇతరత్రా ప్రింటింగ్ ఖర్చుల కింద రూ.కోట్లలో చెల్లించేశారు.

పేరు గొప్పలా ఎస్వీయూ దూరవిద్య విభాగం పరిస్థితి ఉంది.. ఐదు విభాగాల్లో డిగ్రీ మూడేళ్ల కోర్సులు, పీజీ కోర్సుల్లో 19 విభాగాలున్నాయి. గత పాలకుల చేతకానితనంతో విభాగం నేడు మూతపడే స్థాయికి చేరింది. యూజీసీ నిబంధనలు పాటించకపోవడంతో 2022 నుంచి ఇప్పటివరకు ఆ విభాగంలో ప్రవేశాలు లేవు. ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా వాటి ఊసేలేదు. అయితే విద్యార్థులకు కోర్సు మెటీరియల్స్ ఇచ్చేశామని, ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్‌కు ఐదేళ్ల వైకాపా పాలనలో దాదాపు రూ.5.5 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఈ నెల 20న జరిగిన పాలక మండలి సమావేశంలో చర్చించి రూ.1,09,43,323లను మంజూరు చేసేశారు.



ఎస్వీయూలోని ప్రింటింగ్ ప్రెస్

లెక్కలేవీ అంటున్న విద్యార్థులు

ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతున్న వర్సిటీలో ప్రైవేటు ప్రింటింగ్ ఖర్చుల పేరుతో డబ్బులు దోచిపెడుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అభ్యసన పుస్తకాలు (స్టడీ మెటీరియల్) ఎంత ప్రింట్ చేశారు.. ఎంత మందికి ఇచ్చారనే లెక్కలు లేవని విమర్శిస్తున్నారు.

ఇక నుంచి ఆన్‌లైన్ మెటీరియల్ వినియోగం

ప్రైవేటు ప్రింటర్స్ గతంలో దూరవిద్య విభాగానికి మెటీరియల్ సరఫరా చేయడంతో సంబంధిత బిల్లులు ఇటీవల చెల్లించాం. ఇకనుంచి దూరవిద్య విభాగ విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాలకు సంబంధించిన అన్ని అంశాలను పొందుపరుస్తాం. ప్రింటింగ్ చేసి ఇచ్చే విధానానికి స్వస్తి పలుకుతున్నాం. దూరవిద్య ప్రవేశాల పునఃప్రారంభంపై ఇటీవలే దిల్లీ వెళ్లివచ్చాం.
– ఆచార్య భూపతి నాయుడు, రిజిస్ట్రార్

సొంత ప్రింటింగ్ ప్రెస్ ఉన్నా..

వర్సిటీకి ప్రాంగణంలో సొంతంగా ఓ ప్రింటింగ్ ప్రెస్ ఉండగా ఇద్దరు ఉద్యోగులతో వర్సిటీలోని కొన్ని విభాగాల పరీక్షల పేపర్లను మాత్రమే అందులో ముద్రిస్తున్నారు. ఆయా విభాగాలకు స్టేషనరీ, ఇతర మెటీరియల్ పెద్దఎత్తున అవసరమున్నా ప్రెస్ నవీకరణపై దృష్టిసారించడం లేదు. బయటి ప్రింటర్లపై ఆధారపడి నిధులు ఇష్టానుసారం చెల్లించేస్తున్నారు.

మొగిలి ఘాట్‌లో ఘోర ప్రమాదం

ఇద్దరి మృతి.. లారీ దగ్ధం





మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలోని బంగారుపాళ్యం మండలంలోని మొగిలిఘాట్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి రహదారిపై నిలిచి ఉన్న లారీని మరో లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. లారీకి నిప్పంటుకుని కాలి బూడిదైంది. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ కథనం మేరకు వి.కోట నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి తైలం దుంగలను తరలిస్తున్న లారీ ఘాట్ రోడ్డులో మరమ్మతులతో ఆగి ఉంది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ నుంచి మొగిలి వద్ద ఉన్న పొట్రాన్ పరిశ్రమకు చక్కెర తరలిస్తున్న లారీ అదుపుతప్పి కల్వర్టు రక్షణ గోడను ఢీకొట్టింది. ఆపై ఆగిఉన్న లారీని ఢీకొనడంతో డీజిల్ ట్యాంకు పగిలి నిప్పు అంటుకుంది. దీంతో ఆ లారీ రహదారి పక్క పది అడుగుల లోయలోకి బోల్తా పడింది. లారీ నుజ్జునుజ్జయి.. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన లారీ క్లీనరు యాదగిరి(48) క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందగా డ్రైవరు సాయికృష్ణకు గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తైలం దుంగల లారీ డ్రైవరు రామరాజు(48) మంటల్లో కాలి బూడిదయ్యారు. క్లీనరు నాగయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చిత్తూరుకు తరలించారు. సీఐ కత్తి శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తిగా కాలిపోయిన లారీ ◆ కల్వర్టు రక్షణ గోడకు లారీ ఢీకొని విరిగిన చక్రాలు

రెండు నిమిషాల్లోనే..

చిత్రదుర్గ నుంచి నాలుగు లారీలు చక్కెర లోడుతో మొగిలి వద్ద ఉన్న పొట్రాన్ పరిశ్రమకు వస్తున్నాయి. వీటిలో మూడు లారీలు పరిశ్రమలోకి వచ్చేశాయి. మొగిలి ఘాట్‌రోడ్డు దిగుతున్నప్పుడు లారీ అదుపు తప్పుతోందని, జాగ్రత్తగా రావాలని సహచర లారీ డ్రైవర్లు వెనుక వస్తున్న లారీ డ్రైవర్ సాయికృష్ణను హెచ్చరించారు. ఈ క్రమంలో లారీ రెండు నిమిషాల వ్యవధిలో పరిశ్రమలోకి చేరుకుంటుందనగా అదుపు తప్పి రహదారిపై నిలిచి ఉన్న లారీని ఢీకొనడంతో ఆగి ఉన్న లారీ డ్రైవరు రామరాజు మృత్యువాత పడ్డారు. చక్కెర లారీలోని క్లీనరు యాదగిరి క్యాబిన్‌లో ఇరుక్కుని దుర్మరణం పాలయ్యారు. చిత్తూరు, పలమనేరు నుంచి నాలుగు అగ్నిమాపక యంత్రాలు, రెస్క్యూ వాహనంతో డీఎఫ్‌వో పెద్దిరెడ్డి, అగ్నిమాపక అధికారి మనోగరన్ సిబ్బందితో మంటలు అదుపు చేశారు.

డీఎస్పీ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం

ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న డీఎస్పీ ప్రభాకర్ సంఘటనను గమనించి పోలీసులను అప్రమత్తం చేసి.. మంటలను నిలువరించారు. లేకుంటే పెను ప్రమాదం జరిగేది. తైలం దుంగల కింద కాలి బూడిదైన లారీ డ్రైవరు రామరాజును, లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న క్లీనరు యాదగిరి మృతదేహాలను వెలికి తీయించారు.

మొగిలి ఘాట్‌లో మరో రెండు ప్రమాదాలు

ఘాట్‌రోడ్డులో ప్రమాదంతో పోలీసులు వాహనాలు ఒక మార్గంలోనే పంపుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళ్తున్న ట్రైలర్ ముందు వెళ్తున్న పార్శిల్ లారీని ఢీకొని రోడ్డుపై నిలిచిపోయింది. బెంగళూరు నుంచి ఇనుప కమ్మీలు తరలిస్తున్న మరో లారీ డ్రైవరు రహదారిలోని డివైడర్ దాటి మరోవైపు దూసుకెళ్లి రహదారి పక్కన గుట్టను ఢీకొని ఆగింది.

జగన్‌కు అలిపిరి దాటే అర్హత ఎక్కడిది?

సాధుపరిషత్



అలిపిరి వద్ద సాధువులు, హిందూ సంఘాల నేతల ధర్నా

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జగన్ తిరుమల పర్యటనకు వచ్చే సాహసాన్ని మానుకోవాలని, ఓ క్రిస్టియన్ రూపంలో ఉన్న ఆయనకు శ్రీవారి చెంతకువచ్చే అర్హత ఏమాత్రం లేదని సాధువులు, హిందూ సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం గరుడ కూడలి వద్ద రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి తదితరుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హిందూ వ్యతిరేకవాదిగా ముద్రవేసుకున్న జగన్‌మోహన్ రెడ్డికి అలిపిరి దాటే అర్హత లేదన్నారు. ఆయన తిరుమలకు రావాలనుకుంటే తమ శరీరాలు దాటి వెళ్లాలని తీవ్రంగా హెచ్చరించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో 250 ఆలయాలను నేలకూల్చారని, అంతర్వేదిలో రథానికి నిప్పు పెట్టారని, బెజవాడ దుర్గమ్మ గుడిలో చోరీలకు పాల్పడ్డారని.. దొంగల ముఠా వంటి జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. ఓంకార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడెందుకు ప్రాయశ్చిత్తం చేసుకోలేదు

తెలంగాణ భాజపా నేత మాధవీలత




శ్రీవారి మెట్టుమార్గంలో నడిచివస్తున్న మాధవీలత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో లడ్డూప్రసాదం తయారీకి వాడే నెయ్యి బాగోలేదని 18 సార్లు వెనక్కు పంపామని చెప్పిన జగన్ ఆ నివేదిక ఎక్కడుందో చెప్పాలి.. అప్పుడు ఎందుకు ప్రాయశ్చిత్తం చేసుకోలేదు. శ్రీవారి మెట్లు ఎందుకు ఎక్కలేదు' అంటూ తెలంగాణ భాజపా నాయకురాలు మాధవీలత ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతోపాటు దానికి అనుబంధంగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారని, ఇప్పటికైనా హిందువులు మేల్కొనాలని పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం శ్రీవారి మెట్టుమార్గంలో భజనలు చేసుకుంటూ ఆమె తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శ్రీవారికి భక్తులు నిలువుదోపిడీ ఇస్తుంటే కొందరు నాయకులు మాత్రం స్వామివారినే నిలువుదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. శ్రీవారి ఆలయంలోకి అన్యమతస్థులు ప్రవేశించేందుకు ఇచ్చే డిక్లరేషన్ విధానాన్ని చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి ఎత్తివేస్తే.. ఇప్పుడు తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు డిక్లరేషన్‌పై సంతకం చేస్తానంటూ మభ్యపెట్టడం ఎందుకని జగన్‌ను ప్రశ్నించారు.


శ్రీవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బ్రహ్మోత్సవ సుందరీకరణ


ఎల్ఈడీ దీపాలతో శ్రీవారి ప్రతిమ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంటోంది. వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12 వరకు జరుగనున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలు, పండ్లతో ప్రత్యేకంగా వివిధ దేవతామూర్తులు, వారి వాహనాలను తీర్చిదిద్దుతున్నారు.


సీతా స్వయంవరం ఘట్టంతో రూపొందుతున్న సెట్టింగ్ ముందు ఇలా..

పర్యాటకానికి బాటలు

ఈనాడు డిజిటల్, తిరుపతి- తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ఏడేళ్లుగా పడకేసిన పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం కొత్త జీవం పోస్తోంది. అధికారంలోకి రాగానే గత పాలకులు నిర్లక్ష్యం చేసిన పర్యాటక ప్రాంతాలన్నింటినీ వృద్ధిలోకి తేచ్చేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. పీపీపీ విధానంలో పలు రిసార్ట్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాను తిరిగి పూర్తిస్థాయి పర్యాటకంగా తీర్చి దిద్దేందుకు రూ.860 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదికలు తెలిపారు. 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం.

రిసార్ట్‌ల ఏర్పాటుకు..

వైకాపా పాలనలో ఒక్క రూపాయి కూడా జిల్లా పర్యాటకానికి విడుదల చేయలేదు. కనీసం ఆ శాఖకు ఖాతా పుస్తకం లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. 2015లో మాత్రమే పర్యాటకాభివృద్ధి పేరుతో నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యాటకం మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే తూకివాకం బీచ్ వద్ద 20 ఎకరాలతో రిసార్ట్, మల్లెమడుగు సమీపంలో 99 ఎకరాలతో మరో రిసార్ట్ ఏర్పాటుకు స్థలసేకరణ పనులు జరుగుతున్నాయి. పీపీపీ విధానంలో మూడు ఎకరాల్లో హోటల్ నిర్మాణానికి చంద్రగిరి, రామచంద్రాపురం ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. పోత్తికంగా ధ్వంసమైన పర్యాటక ప్రాంతాల్లో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.

ఆరేళ్ల తరువాత తిరిగి

రాయల రాజసానికి ఆనవాలుగా ఉన్న చంద్రగిరి కోట 2018లో పిడుగుపాటుకు గురైనప్పటినుంచి పర్యాటకంగా అంతంత మాత్రమే నిలిచింది. తిరిగి కోటకు పూర్వ వైభవం తెచ్చేలా పర్యాటక శాఖ కసరత్తులు ప్రారంభించింది. పీపీపీలో భాగంగా లక్స్ అండ్ డెసిబుల్స్ అనే సంస్థకు ఆధునీకరణ పనులు అప్పగించారు. అందులో భాగంగా పర్యాటక దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 6 కోటలో తిరిగి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ పునరుద్ధరించి, పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బోటింగ్, ఫుడ్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది.


తలకోన జలపాతం

నెల ఆదాయం రూ.3 కోట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరుమలలో ఐదు రెస్టారెంట్లు, హార్సిలీహిల్స్ అండ్ హరిత హిల్ రిసార్ట్, శ్రీకాళహస్తిలోని హరిత రెస్టారెంట్, పులిగుండు, కైలాసకోన, పుత్తూరు సమీపంలో హరిత రిసార్ట్ మొదలైనవి ఏపీ టీడీసీ పర్యవేక్షణలో ఉండగా కేవలం ఆగస్టు ఒక్కనెలలోనే 34,663 మంది పర్యాటకులు సందర్శించగా, రూ.3,20,14,161 ఆదాయం రావడం గమనార్హం. కుప్పం,

ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కావాల్సిన నిధులు

ప్రాజెక్ట్ పేరు	నిధులు (రూ.కోట్లలో)
తలకోన (కారవాన్, ట్రెక్కింగ్, ఎకో టూరిజం)	27
కైలాసకోన (రిసార్ట్, ట్రెక్కింగ్, కారవాన్, ఎకో టూరిజం)	30
మామండూర్ (కారవాన్, టూరిజం)	22
కల్యాణి డ్యాం (రిసార్ట్, టూరిజం)	32
మల్లెమడుగు (రిసార్ట్, వాటర్ స్పోర్ట్స్, వెల్‌నెస్ సెంటర్)	100
జూపార్క్ (జంగిల్ సఫారీ)	75
మొనపాలెం బీచ్ (రిసార్ట్, వాటర్ స్పోర్ట్స్)	50
చంద్రగిరికోట (ట్రెక్కింగ్, కారవాన్, హెరిటేజ్ టూరిజం)	12
శ్రీకాళహస్తి (టెంపుల్ టౌన్ అభివృద్ధి, భక్తకన్నప్ప కొండకు రోప్‌వే)	115
తుపిలిపాలెం (బీచ్ రిసార్ట్, వాటర్ స్పోర్ట్స్)	36


ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఉన్న హార్సిలీహిల్స్ ప్రాంతంలో పర్యాటకులు

నగరి, పలమనేరు ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్లను పీపీపీ పద్ధతిలో ఇవ్వడం జరిగింది. జిల్లాలో పర్యాటకరంగాన్ని ఆదాయ వనరుగా మార్చేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు. పురాతన దేవాలయమైన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయానికి సైతం నేటి నుంచి ఏపీటీడీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనుంది.

మంత్రి చొరవతో పర్యాటక సమస్యలకు పరిష్కారం.. తిరుపతి డివిజన్ ఆదాయం పరంగా స్థిరంగా ఉన్నప్పటికీ పర్యాటకరంగ విస్తరణ జరగాలని మంత్రి కందుల దుర్గేశ్ ఇటీవల సమీక్షలో వెల్లడించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొన్ని ప్రతిపాదనలు అందజేశాం. మరికొన్ని సిద్ధమవుతున్నాయి. తిరుమలలో పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు, తలకోన, హార్సిలీహిల్స్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం.
- గిరిధర్‌రెడ్డి, డీవీఎం, తిరుపతి డివిజన్

విజయపురంలో 65.6 మి.మీటర్ల వర్షం

చిత్తూరు(మిటూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి జిల్లాలోని 14 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురం మండలంలో 65.6 మి.మీటర్లు కురవగా.. అత్యల్పంగా సదుంలో 0.2 మి.మీటర్ల వర్షం కురిసింది. నగరిలో 42.2 మి.మీటర్లు, నింద్ర 38.4, పాలసముద్రం 29.2, చిత్తూరు గ్రామీణ 26, కార్వేటినగరం 14.6, పులిచెర్ల 12.4 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

మార్కెటింగ్ శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాజేశ్వరరావు

చిత్తూరు(న్యాయవిభాగం): వ్యవసాయ మార్కెటింగ్ శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది గంగిశెట్టి రాజేశ్వరరావును నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మరికొన్ని జిల్లాలతో పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. చిత్తూరు, తిరుపతి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని మార్కెట్ కమిటీలకు ఆయన స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరిస్తారు.

నిరుద్యోగ సమస్య తీరాలంటే పరిశ్రమల స్థాపన జరగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నిరుద్యోగ సమస్య తీరాలంటే సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల స్థాపన జరగాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పీఎంఈజీపీ పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు, రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ కింద వివిధ రుణాలు, రాయితీ మంజూరు చేస్తున్నట్లు వివరించారు. చదువుకున్న యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, మరికొందరికి ఉపాధి కల్పించవచ్చన్నారు. ఔత్సాహికులు వారి ప్రాజెక్టులతో సిద్ధంగా ఉంటే త్వరగా రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ వృత్తిలో ప్రావీణ్యం ఉన్న వారు ఒక క్లస్టర్‌గా ఏర్పడి వ్యాపారం మొదలు పెడితే మరింత ఫలితాలు వస్తాయన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర కమిషన్(కేవీఐసీ) డైరెక్టర్ ఎస్.గ్రేస్ మాట్లాడుతూ చేతిమగ్గాలు ఉన్నవారికి వారు నేసే వస్త్రాల ఉత్పత్తిని, నాణ్యతను పెంచేలా పవర్‌లూమ్స్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 45 శాతం రాయితీ ఇస్తున్నామని, డీఆర్‌డీఏ ద్వారా ఈ సదుపాయాలు పొందవచ్చన్నారు. ఎల్‌డీఎం హరీష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

చిత్తూరు (క్రీడలు): పరిసరాల పరిశుభ్రతతో ప్రపంచంతో మమేకం పోటీపడాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో చిత్తూరులోని గంగినేని చెరువు పార్కు వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ప్రకృతి పరిరక్షణకు పాటుపడదాం' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీతో పాటు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ అముద, ఎన్‌వైకే అధికారి ప్రదీప్‌కుమార్, రాజకీయ పార్టీల నేతలు జగదీశ్వరనాయుడు, చిట్టిబాబు, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్

బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవనంలో అంతర్జాతీయ సౌంజ్ఞల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బధిరులు ఇచ్చిన డిమాండ్లను తమ పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరిస్తామని, మిగిలిన అంశాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించేలా చూస్తామన్నారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు బధిరులకు అండగా ఉంటామని, వారికి అవసరమైన పరికరాలు అందజేస్తామని హామీనిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పలువురు సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

27న నిధి ఆప్కే నికట్ 2.0

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్‌వో) వినియోగదారుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 27న తిరుపతి నగరం కొంగారెడ్డిపల్లెలోని క్యాంఫర్డ్ పాఠశాలలో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తిరుపతి ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 కౌశిక్ రాయ్ గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి 'తిరుమల ప్రక్షాళన' పాదయాత్ర

ఈనాడు, అమరావతి: తిరుమల క్షేత్ర పవిత్రత, కోట్లమంది భక్తుల మనోభావాల పరిరక్షణే లక్ష్యంగా 'తిరుమల ప్రక్షాళన' పేరుతో పాదయాత్ర చేపడుతున్నట్లు భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తెలిపారు. పుంగనూరులోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శుక్రవారం ప్రారంభించనున్న పాదయాత్రకు యడ్యూరి యతిరాజ్ మరాఠాపీఠ పీఠాధిపతి బాలయోగి సత్యదేవానంద స్వామీజీ, మహంత్ కల్యాణ్‌దాస్‌జీ మహారాజ్ (హనుమాన్ మఠం పీఠాధిపతి, అయోధ్య), శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానందస్వామి, త్రిశక్తి మంత్రాశ్రమ సిద్ధయోగులు శివశక్తి శక్తిశ్రీ భగవతీ మహారాజ్ స్వామి, శ్రీకృష్ణ యాదవానంద స్వామీజీ (యాదవ గురుపీఠం, కర్ణాటక) హాజరవ్వనున్నారని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30న అలిపిరి వద్ద యాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాల విడుదల

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెలలో నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు ఆ విభాగం అధికారులు తెలిపారు. వర్సిటీ ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ పదో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

ఎన్నాళ్లీ.. రక్తధారలు

- ప్రాణాలు తీస్తున్న మలుపు
- నిర్వహణ లోపమే కారణం

పలమనేరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రహదారుల నిర్మాణాన్ని చేపట్టిన సంస్థలే నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. కానీ చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో ఈ పరిస్థితి లేదు. జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టిన దిలీప్ బిల్డ్‌కాన్ కంపెనీకి గతేడాది గడువు ముగిసిపోయింది. అయితే మరో కంపెనీకి బాధ్యత అప్పగించలేదు. దీంతో మనిషి పైనే భారం పడుతోంది. ఫలితంగా నిర్వహణ లేక ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి.

వేగం అదుపు చేయలేకనే.. మొగిలి ఘాట్‌లో దొరచెరువు నుంచి మొగిలి వైపు వెళ్లే దారి మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డులో 10 టన్నుల కంటే ఎక్కువ లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు పల్లంగా ఉండడం, పిన్‌బెండ్ కారణంగా వీల్స్ తిరగక ప్రమాదాలు జరుగుతున్నాయి. జీబ్రా గుర్తులు లేకపోవడంతో డ్రైవర్లు వేగాన్ని అదుపు చేయలేకపోతున్నారు. ఇతర రాష్ట్రాల డ్రైవర్లకు రోడ్డు పరిచయం లేక కొన్నిసార్లు ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది.


అదుపు తప్పి పొదల్లోకి దిగిన లారీ

చేపట్టాల్సిన చర్యలివీ..

- రోడ్డుకు ఇరువైపులా దీపాలు ఏర్పాటు చేయాలి.
- మలుపు ఉండటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- మలుపు వస్తుందనగా వేగ నియంత్రిక కోసం బ్యారికేడ్లు ఉంచాలి.
- జీబ్రా గుర్తులు వేయాలి.
- వంద మీటర్ల దూరంలోనే స్పీడు లిమిట్ బోర్డు ఉంచాలి.
- లారీ డ్రైవర్లకు అవగాహన కలిగేలా ప్రమాద సూచికలు ఉంచాలి.

మొగిలి ఘాట్‌లోనే.. ముఖ్యంగా మొగిలి ఘాట్ వద్దనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాజాగా రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. లారీ పూర్తిగా దగ్ధమైంది. ఇదిలా ఉంటే ఈ రోడ్డు పల్లంలో ఉండటమే కాకుండా రోడ్డు డిజైన్ కూడా సక్రమంగా లేదనే విమర్శలున్నాయి. ప్రత్యేక బృందం ఇటీవల చేసిన విచారణలో ఈ విషయాన్ని 'ఎక్స్‌పర్ట్ ఇన్ అనలైజింగ్ ఆక్సిడెంట్స్' విభాగం గుర్తించింది. రెండు వారాల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందగా 31 మంది గాయపడ్డారు. ఆ సమయంలో ప్రమాదాన్ని అంచనా వేయడానికి వచ్చిన ప్రత్యేక బృందం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీంతో మరమ్మతులుగా జాతీయ రహదారుల శాఖను చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

తేదీ	ప్రమాదం	మృతులు	క్షతగాత్రులు
జులై-8	లారీ-ద్విచక్ర వాహనం ఢీ	1	1
ఆగస్టు-15	లారీ-వ్యాన్ ఢీ	0	2
సెప్టెంబరు 13	రెండు లారీలు-బస్సు ఢీ	9	31
సెప్టెంబరు 26	రెండు లారీలు ఢీ	2	2

చర్యలు చేపడతాం

రోడ్డు నిర్వహణ కోసం టెండర్లు పిలుస్తాం. వచ్చిన ఏజెన్సీ ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. పోలీసుల సహకారంతో బ్లాక్ పాయింట్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం.
- వెంకటేశ్వర్లు, పీడీ, ఎన్‌హెచ్ఏ, తిరుపతి

కాపాడండి సార్..



ఈ రోడ్డు మీద ప్రమాదాలు నివారించి డ్రైవర్ల ప్రాణాలు కాపాడండి సార్. పిన్‌బెండు ఉండటమే కాకుండా రోడ్డు పల్లంగా ఉన్నందున వాహనాలు అదుపు కావడం లేదు.
- రమణ, డ్రైవర్, బెంగళూరు


కూరగాయలు విరాళంగా అందిస్తున్న సత్యన్న

రెండు టన్నుల కూరగాయల విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి పలమనేరు వడ్డెపల్లె మార్కెట్ కమిటీకి చెందిన సత్యన్న రెండు టన్నుల కూరగాయలను.. ఈవో పి.గురుప్రసాద్‌కు గురువారం రాత్రి అందించారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంట్ బాల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నింద్ర, న్యూస్‌టుడే: కొత్త ఆరూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని యామిని ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యార్థులకు చిత్తూరులోని డీపీఎస్ స్టేడియంలో జరిగిన 200, 400మీటర్ల అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ జ్ఞానకుమార్ తెలిపారు. అక్టోబర్ 9, 10న జరిగే శ్రీకాకుళంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు గిరిజావతి, ఉపాధ్యాయుల బృందం.. ఆ విద్యార్థిని అభినందించారు.


యామిని

జరిమానాల వసూళ్లలో ఇంత జాప్యమా..?

చిత్తూరు(మిటూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యం కేసుల్లో ఆక్రమదారులకు విధించే జరిమానాల వసూళ్లలో ఎందుకు జాప్యం చేస్తున్నారు.. తక్షణమే వసూలు చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డిస్కం క్వాలిటీ కంట్రోల్, ఎనర్జీ ఆడిటింగ్ విభాగం సీజీఎం ఆదినారాయణ ఆదేశించారు. గిరింపేటలోని చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ కార్యాలయంలో గురువారం అర్బన్, రూరల్ డివిజన్ల ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జరిమానాల బకాయిలు సత్వరమే వసూలు చేయాలన్నారు. అలా చేయకుండా సంబంధిత సర్వీసులు రద్దు చేయొద్దని చెప్పారు. ప్రతి ఒక్కరూ విద్యుత్తు నష్ట నివారణ చర్యలపై దృష్టి సారించాలన్నారు. తక్కువ లోడుతో అదనపు విద్యుత్తు వాడకం, ఆక్రమంగా విద్యుత్తు వినియోగాన్ని అరికట్టాలని చెప్పారు. మినరల్ వాటర్ ప్లాంట్‌లకు తప్పనిసరిగా కేటగిరి-2 సర్వీసులు ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్వీసు పరిశీలించి విద్యుత్తు నష్టాన్ని నివారించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. డిస్కం విజిలెన్స్ విభాగం ఎస్ఈ శ్రీనివాసబాబు, చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల ఈఈలు మునిచంద్ర, సురేష్‌కుమార్, డీఈఈలు, ఏఈలు, ఈఆర్వో అధికారులు పాల్గొన్నారు.


ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న డిస్కం సీజీఎం ఆదినారాయణ

రసవత్తరంగా ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14, అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు చిత్తూరులోని మెసానికల్ మైదానంలో గురువారం రసవత్తరంగా సాగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆటగాళ్లు అధిక సంఖ్యలో క్రీడలకు హాజరయ్యారు. వీరికి పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. గురువారం బాలుర పరుగు పోటీలు ముగియగా.. మిగిలిన క్రీడాంశాల్లో తదుపరి పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులు వసంతవాణి, బాబు, వసంత తదితరులు పాల్గొన్నారు.


లాంగ్‌జంప్‌లో క్రీడాకారిణి


పరుగుపందెంలో బాలురు

నేడు ఎస్వీయూలో ఉద్యోగ మేళా

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ భవనంలోని 215వ గదిలో ఉదయం తొమ్మిది గంటలకు మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ అభయ్ రామ్ ఆధ్వర్యంలో 2021 పూర్వం ఎమ్మెస్సీ, ఎంసీఏ పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఎంపికకు అర్హులని ప్లేస్‌మెంట్ అధికారులు ఆచార్య అంజన్ బాబు, ఆచార్య రమేష్ బాబు తెలిపారు.

ఘర్షణ కేసులో ఇరువర్గాలకు జైలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: భూ వివాదం విషయంలో ఘర్షణ పడిన ఇరువర్గాల కేసులో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ గురువారం స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఏపీపీ కృష్ణారెడ్డి, బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంగారుపాళ్యం మండలం బోడబండ్ల పంచాయతీ పోస్టిపాళ్యంకు చెందిన రమునాథ మండలి కుటుంబానికి.. అదే గ్రామంలోని లోకనాథ కుటుంబాల మధ్య డీకేటి స్థలం విషయమై వివాదం నెలకొంది. ఈ అంశాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారు పరిష్కరించే లోపే 2021 అక్టోబరులో రమునాథ మండలి కుమారుడు ఈశ్వర్ అలియాస్ రఘురామరాజు వివాద స్థలంలో ఇంటి బండరాళ్లు తరలించారు. దీనిపై ఇరువర్గాల వారు ఘర్షణ జరిగి గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రీ కొడుకు రమునాథ మండలి, రామరాజులు, మరో వర్గం తండ్రీ కొడుకు లోకనాథం, మాధవయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలు పరిశీలించిన పిదప ఇరువర్గాలపై నేరం రుజువు కావడంతో రమునాథ మండలి, రామరాజులు రెండేళ్ల జైలు, మూడు వేల రూపాయల జరిమానా, మరో వర్గం లోకనాథం, మాధవయ్యకు ఏడాది జైలు, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం: ఆనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకుందని పోలీసులు గురువారం తెలిపారు. వారి కథనం మేరకు మండలంలోని చెంద్రమాకుపురం గ్రామానికి చెందిన సరిత(38) గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 23న విషపూరిత వడకాలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి ఎస్సై ప్రసాద్ రామచంద్రారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి


సాయిబాబా

కార్వేటినగరం, న్యూస్‌టుడే: స్థానిక త్యాగరాజుల్లి వీధికి చెందిన సాయిబాబా(54).. ఆదే వీధికి చెందిన ఆజిత్ ఇంట్లో ప్రమాదవశాత్తు గాయపడిన తంతో ఆతడిని ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు స్థానికంగా బయలుదేరాడు. మార్గమధ్యలో కార్వేటినగరం మండల సమీపంలో వద్ద ప్రమాదవశాత్తు సాయిబాబా ఆటోలో నుంచి జారి కిందపడ్డాడు. ఆతడి తలకు తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

వెంకటాద్రి కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ఎక్సైజ్ డీసీగా విజయశేఖర్



చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌(డీసీ)గా టి.విజయశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ఎస్‌ఈబీలో ఉన్న ఆయనను ఎక్సైజ్ శాఖ కేటాయించడంతో గురువారం చిత్తూరులో డీసీగా బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డిస్ట్రిక్‌లో సహాయ కమిషనరుగా ఉన్న కె.శ్రీనివాసాచారి.. చిత్తూరు ఏసీగా బాధ్యతలు చేపట్టగా, తిరుపతి ఎస్‌ఈబీలో ఈఎస్‌గా ఉన్న ఎస్‌.శ్రీనివాస్ చిత్తూరు ఈఎస్‌గా బాధ్యతలు చేపట్టారు.

నేడు ఉద్యోగ మేళా

పుత్తూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కేంద్రం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, పాలసముద్రం

సమస్య: గంగమాంబపురం పంచాయతీ దళితవాడలో మురుగునీటి కాలువ అధ్వానంగా మారింది. అందులో బురద తొలగించాలి. **- కుమరేష్, గ్రామస్థుడు**

సమాధానం: దళితవాడలోని మురుగునీటి కాలువలో నిలిచిపోయిన బురద వెంటనే తొలగింపజేస్తాం. **- రమేష్, ఈవోఆర్డీ**

న్యూస్‌టుడే, వెదురుకుప్పం

సమస్య: పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కనే ఉన్న దుకాణాలతో పారిశుద్ధ్యం లోపించి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. **- చెంగల్రాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు**

సమాధానం: ఇప్పటికే దుకాణదారులకు సూచనలిచ్చాం. నిర్ణీత గడువులోగా దుకాణాలు తొలగించి సుందరీకరణ పనులకు సహకరిస్తాం. **- మోహన్‌కుమార్, డీడీవో, గ్రామ సచివాలయం**

న్యూస్‌టుడే, పెనుమూరు

సమస్య: గుత్తావాండ్లఊరు పంచాయతీ మఠంపల్లె దళితవాడలోని మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. **- స్థానికులు**

సమాధానం: మురుగునీటి కాలువలు పరిశీలిస్తాం. సమస్య సర్పంచి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- మదన్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి**



ఫోన్‌లో ప్రజా సమస్యల్ని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్మోహన్, చిత్రంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు ఆలకించారు. 42 ఫిర్యాదులు అందగా.. వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారుల్ని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇకపై ప్రతి నెలా ఒకరోజు మాత్రమే డయల్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యల్ని తెలుసుకుంటామన్నారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ కళావతి పాల్గొన్నారు.



ప్రవేశం పొందిన ఎన్‌సీసీ విద్యార్థులు

ఎన్‌సీసీ దేశభక్తికి ప్రతిరూపం

పుత్తూరు: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. కళాశాలలో గురువారం ఎన్‌సీసీలో ప్రవేశం పొందిన 34 మంది విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా సామాజిక సేవ, జాతీయ భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. శిక్షణ పొందిన వారికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, పోలీసుశాఖల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడానికి ఉత్సాహం చూపుతారన్నారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, 29వ ఆంధ్ర బెటాలియన్ తిరుపతికి చెందిన సుబేదార్ బిమల్‌మింజ్, హవల్దార్ శివరాజ్, తెలుగు అధ్యాపకులు వెంకటేశన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఆర్వోపై చిగురిస్తున్న ఆశలు

- నూతన సర్కిల్ ఏర్పాటుతోనైనా కార్యరూపం దాల్చేనా..?
- వినియోగదారులకు సేవలు చేరువయ్యేనా

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

కూటమి ప్రభుత్వం జిల్లా కేంద్రం చిత్తూరులో విద్యుత్తు శాఖ నూతన సర్కిల్ కార్యాలయానికి శ్రీకారం చుట్టింది.. వీలైనంత త్వరగా సర్కిల్ కార్యాలయ సేవలను వినియోగదారులకు చేరువచేసే దిశగా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.. గత అయిదేళ్లు వైకాపా ప్రభుత్వం ఈఆర్వో ఏర్పాటు గాలి కొదిలేసింది.. నూతన సర్కిల్ ఏర్పాటు పుణ్యామాని విద్యుత్తు శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్‌లో ఉప ఈఆర్‌వో(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు) ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని ఆ శాఖ అధికారులు, వినియోగదారులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

కంపెనీలోనే..

ఎస్‌పీడీసీఎల్ కంపెనీలోనే ఒకే ఈఆర్‌వో కార్యాలయం ఉన్న డివిజన్ చిత్తూరు అర్బన్ ఒక్కటే. కొత్తగా ఏర్పడిన పుంగనూరు డివిజన్‌లో మూడు ఈఆర్‌వో సెక్షన్లు ఉన్నాయి. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో 12 విద్యుత్తు సెక్షన్లు ఉండగా.. సబ్-డివిజన్-1 పరిధిలో కొంగారెడ్డిపల్లె, గిరింపేట, సంతపేట, మిట్టూరు, సబ్-డివిజన్ రూరల్-2 కింద పూతలపట్టు, పెనుమూరు, గంగాధరనెల్లూరు, ఆవలకొండ, పాలసముద్రం సెక్షన్లు, సబ్-డివిజన్ రూరల్-3 కింద రెడ్డిగుంట, కొత్తపల్లె, చిత్తూరు రూరల్ సెక్షన్లు ఉన్నాయి. 12 సెక్షన్లకు కలిపి ఒకటే ఈఆర్‌వో కార్యాలయం జిల్లా కేంద్రమైన చిత్తూరులోని అర్బన్ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో ఉంది. ఒక ఈఆర్‌వో వల్ల అటు ఉద్యోగులు. . ఇటు క్షేత్రస్థాయి సిబ్బందికి పనిఒత్తిడితో పాటు.. వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.



విద్యుత్తు శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఆర్వో కార్యాలయం

ప్రతిపాదనలు బుట్టదాఖలు..

గంగాధరనెల్లూరు, ఆవులకొండ, పాలసముద్రం సెక్షన్లకు సంబంధించి గంగాధరనెల్లూరులో ఈఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. కొన్నేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. వైకాపా ప్రభుత్వం ఈఆర్‌వో ఏర్పాటును విస్మరించింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు కనీసం దీన్ని పట్టించుకోకపోవడం శోచనీయం.

ఇబ్బందులివే..

12 సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు అదనపు లోడు, కొత్తగా సర్వీసుల జారీకి నిర్దేశిత లక్ష్యం ప్రకారం బిల్లులు చెల్లించాలి. ఈ బిల్లులను చిత్తూరులోని ఈఆర్‌వో కార్యాలయంలోనే చెల్లించాలి. ఒకే కార్యాలయం వల్ల పాలసముద్రం, పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు.. బిల్లుల్లో సవరణలు, సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిత్తూరు అర్బన్ డివిజన్‌లో విద్యుత్తు సర్వీసుల వివరాలిలా..

మొత్తం సర్వీసులు :	1,76,563
గృహ సర్వీసులు :	1,24,979
వాణిజ్య సర్వీసులు :	16,464
పరిశ్రమల సర్వీసులు :	1664
రక్షిత నీటి సరఫరా పథకం సర్వీసులు :	4836
వీధి దీపాల సర్వీసులు :	28,621



మట్లాడుతున్న గాలి భానుప్రకాష్



పెనుమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

ప్రజా ఆకాంక్షే కూటమి ప్రభుత్వ లక్ష్యం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెదేపా కూటమి పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. చెన్నసముద్రంలో 'ఇది మంచి ప్రభుత్వం' సభలో గురువారం మాట్లాడారు. వంద రోజుల పాలనలో ప్రజల ఆశలకు అనుగుణంగా ఉందని, అందుకే ధైర్యంగా ప్రజల్లోకి వచ్చామన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర-2047 గోడప్రతుల్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెదేపా జిల్లా నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు, శశికర్‌బాబు, రఘు, అధికారులు పాల్గొన్నారు. ● చెర్లోపల్లెలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో తహసీల్దారు కళావతి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ కాంద్ర రమేష్‌నాయుడు స్వర్ణ ఆంధ్ర-2047 గోడప్రతులు ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి శివరాజన్ పాల్గొన్నారు. **పెనుమూరు, కార్వేటినగరం, జీడీనెల్లూరు:** ఎన్నికల్లో మీకృషి మరిచిపోనని మీ రుణం తీర్చుకునేలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే థామస్ అన్నారు. ఆయన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కార్వేటినగరం, పెనుమూరు, జీడీనెల్లూరు మండలాల్లో పర్యటించారు. ఆయా మండలాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక సీమంతం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెదేపా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, జనసేన బాధ్యుడు యుగంధర్, హరిబాబునాయుడు, రుద్రయ్యనాయుడు, నాగేశ్వరరాజు, జనార్దనరాజు, రెడ్డెప్ప, అధికారులు పాల్గొన్నారు. **తవణంపల్లె:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అందరికీ మంచి రోజులు వచ్చాయని ఎన్‌ఆర్‌ఐ ప్రవీణ్ అన్నారు. ఎ.గొల్లపల్లి పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఎన్‌ఆర్‌ఐ ప్రవీణ్, అధికారులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. సర్పంచి సబిత, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. **వడమాలపేట:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఇది మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ఓబీఆర్‌కండ్రిగలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం: నగరిలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రవి, ఐరాల మండలంలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ గురువారం స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ● డీటీగా నాగరాజు.. మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతలు చేపట్టారు. విజయపురం నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు.

ఇది చెరువే.. నమ్మాలి మరి..!



చిత్తూరు నగరం గిరింపేట దుర్గానగర్ కాలనీలోని కుమ్మరవాని చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయి దుస్థితిలో కూరుకుపోయింది. చెరువు మొత్తం గుర్రపు డెక్క వ్యాప్తి చెందడంతో నీరు ఎండిపోయింది. దోమల బెడద విపరీతంగా పెరిగింది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చెరువుని శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చిత్తూరు(కలెక్టరేట్)



మాధవయ్యను సత్కరిస్తున్న తెదేపా నాయకులు

సేవలకు గుర్తింపు

పుత్తూరు: రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గంజి మాధవయ్యను గురువారం పలువురు తెదేపా నాయకులు సత్కరించారు. ఆయన సేవలు కొనియాడారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గజపతి, తెదేపా నాయకులు బాబునాయుడు, కరుణ, ఉపాధ్యాయుడు సోమశేఖర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తున్న క్లబ్ జిల్లా అధ్యక్షుడు కదిరవన్, సభ్యులు

తమిళనాడు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పాలసముద్రం : నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దు తమిళనాడు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు రఘు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత నోటుపుస్తకాలు, పెన్నులు, పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లను డాన్‌టుడస్క్ లయన్స్ క్లబ్ ద్వారా అందించారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన డాన్‌టుడస్క్ లయన్స్‌క్లబ్ సరిహద్దు విద్యార్థులకు, పాఠశాలకు సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింత సేవలందించి విస్తృతంగా విస్తరించాలన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు రామచంద్రన్, యం.ఎస్ రమేష్. దేవన్, మోహన్, రాజీవ్‌గాంధీ, శివలింగం పాల్గొన్నారు.



చినుకు పడక.. వేరుసెనగ రైతు కష్టాలు..!

చినుకు రాలక వేరుసెనగ రైతన్న అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వేరుసెనగ విత్తన కాయలు సకాలంలో అందడంతో తొలకరి పలకరించింది. విత్తు వరకు వర్షాలు కురిసినా ఆపై అవి దూరమయ్యాయి. వివిధ దశల్లో కళ్లెదుటే పంట ఎండుతుంటే దాన్ని రక్షించుకోవాలని వివిధ రూపాల్లో రైతులు కృషిస్తున్నారు. పచ్చనపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం తనకున్న ఎకరా పొలంలో వేరుసెనగ వేశారు. ప్రస్తుతం చేతికి అందే నూర్పిడి దశలో వర్షాలు లేక పంట ఎండుతోంది. చూస్తూ ఉండలేక ట్యాంకర్లతో నీటిని తెప్పించి, పొలాలనికి తడి అందించి, నూర్పిడి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ



పట్టువస్త్రాలు తెస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి, కాణిపాకం ఈవో గురుప్రసాద్

వరసిద్ధుడికి పట్టువస్త్రాల సమర్పణ



కళాకారిణి ప్రదర్శన

కాణిపాకం : శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేకోత్సవాల్లో సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం తరఫున ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కాణిపాకం ఆలయ ఈవో పి.గురుప్రసాద్‌కు గురువారం అందజేశారు. వారికి స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కాణిపాకం ఈవో అందించి స్వాగతం పలికారు. ఆలయ ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి ఉన్నారు. ● పూలంగి సేవ సందర్భంగా ఆలయ ఆస్థాన మంపడంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన హరికథ, భక్తిపాటల ఆలాపన, కూచిపూడి, భరతనాట్య, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

మౌలిక వసతులు కల్పించాలి.. పుత్తూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని పట్టణ సీపీఐ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టేషన్ మేనేజరు శ్రీనివాసులుకు వినతి అందజేశారు. ప్లాట్‌ఫాంపై ఉన్న మరుగుదొడ్లకు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసి వాష్ రూంకు తాళాలు వేయడంతో ఇబ్బందులు పడుతున్నారని, కొళాయిల్లో తాగునీరు రావడంలేదన్నారు. వెయిటింగ్ రూమ్‌లో కనీస వసతులు లేదన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. నాయకులు గోపీ, రాజేష్, భాస్కర్, కాశీ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సైకిల్ ర్యాలీ.. పూతలపట్టు: స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు వాసుదేవన్, మధుసూదనరెడ్డి నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమించాలి.. చిత్తూరు గ్రామీణ: ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ అన్నారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సీపీఐ అనుబంధ సంఘాల శాఖలతో గురువారం సమావేశం జరిగింది.

మల్లికార్జునశెట్టి మృతి తీరని లోటు.. పెనుమూరు: మూడు రాష్ట్రాల పద్మశాలి కుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జునశెట్టి మృతి సంఘానికి తీరనిలోటని రాష్ట్ర చేనేత సంఘం

అవీ.. ఇవీ.. అన్నీ..

అధ్యక్షుడు ఆకుల వాసు అన్నారు. గురువారం ఆయన గొడుగుమానుపల్లెలో మల్లికార్జునశెట్టి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరక్టర్ మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మాజీ ఎంపీపీ షణ్ముగవర్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి.. చిత్తూరు (నేరవార్తలు) : ఉన్నతాధికారుదల ఆదేశాల మేరకు చిత్తూరు నగర శివారులోని అనుపల్లి వద్ద జూద శిబిరంపై తాలూకా పోలీసులు దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకుని రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

చనిపోయిన వారి వివరాలు ఎందుకు అప్‌లోడ్ చేయలేదు..?.. గుడిపాల: సహకార సంఘంలో సభ్యులుగా ఉండి మరణించిన వారి పేర్లు కంప్యూటర్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేదని జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్ధిని ప్రశ్నించారు. గురువారం స్థానిక సహకార సంఘ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

దివ్యాంగుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయండి .. చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్‌లలో దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పక్కాగా అమలు చేయాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌ను.. జిల్లా ఆర్‌పీడీ చట్టం కమిటీ సభ్యులు చంద్రశేఖర్ కోరారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి చట్టం పుస్తకాన్ని అందజేశారు. ఏపీ నిరుద్యోగ దివ్యాంగుల వికాస సభ్యులు ఫయాజ్ పాల్గొన్నారు.



జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో నగరి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి, న్యూస్‌టుడే: చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెట్విన్, యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జానపదం గ్రూపు డ్యాన్స్‌లో మేఘన, విజయలక్ష్మీ, విశాలాక్షి, గాయత్రి, లోకేశ్వరి, పద్మ, కలైరోజా ద్వితీయ బహుమతి సాధించారన్నారు. జానపదం సోలో డ్యాన్స్‌లో గాయత్రి ద్వితీయ బహుమతి, పెయింటింగ్‌లో హేమావతి ద్వితీయ బహుమతి, ఉపన్యాస పోటీల్లో హేమావతి, అముద, సైఫ్ అలీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. సెట్విన్ సీఈవో మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అరుణకుమారిని గురువారం కళాశాలలో అభినందించారు.

జీడీనెల్లూరు: ఇటీవల ఎస్‌ఆర్‌పురం హైస్కూలు క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేపంజేరి హైస్కూలుకు చెందిన అయిదుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, పీడీ జయచంద్ర గురువారం తెలిపారు. యాదమరి: బాలికా సంరక్షణపై చిత్తూరు నగరంలోని పీసీఆర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కె.గొల్లపల్లి విద్యార్థిని రోషిణి ద్వితీయ బహుమతి పొందిందని ప్రధానోపాధ్యాయురాలు లలిత తెలిపారు. పుత్తూరు: విద్యార్థులు క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలని ఎంఈవో తిరుమలరాజు పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. **బంగారుపాళ్యం:** విద్యార్థులు క్రీడా పోటీలలో ప్రతిభను కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని దాత బాలక్రిష్ణా చెప్పారు. రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు.

చిత్తూరు విద్య: జాతీయ స్థాయి టైక్వాండ్ పోటీల్లో స్థానిక సంసిద్ధ్ క్యాంఫర్డు పాఠశాల తొమ్మిదోతరగతి విద్యార్థి జునైద్‌బేగ్ రెండు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయిని కవిత కేశవులు గురువారం తెలిపారు.

గుంతను పూడ్చిన యువత

నింద్ర,న్యూస్‌టుడే: వేదాంతపురం ఎస్టీ కాలనీ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతను స్థానిక యువత సిమెంటు కాంక్రీటుతో పూడ్చారు. ఈ గుంతలో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని వాపోతున్న నేపథ్యంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోలేదు. దీంతో గ్రామంలోని యువత ఇలా సొంతంగా చేయడం విశేషం.

కోడిపందెం.. ఇద్దరి అరెస్ట్

యాదమరి: మండల కేంద్రానికి సమీపంలో వేణుగోపాలపురం అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై ఈశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం అక్కడకు చేరుకుని రెండు కోడిపుంజులతో పాటు, రూ.1100 నగదు, 4 కోడి కత్తులు, పందెం ఆడుతున్న చిత్తూరు నగరం ఇరువారానికి చెందిన ఆదం, షంషీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చిత్తూరు(సంతపేట): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతల వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు. కన్వీనర్ శేషనారాయణ పాల్గొన్నారు.



పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

ప్రహరీ నిర్మాణం చేపడతాం
పుంగనూరు గ్రామీణ: గూడూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ధ్వంసం చేసిన ప్రహరీని గురువారం సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ప్రహరీ నిర్మాణం చేపడతామన్నారు.

అక్రమ రవాణా కట్టడి
పలమనేరు: ఇసుక అక్రమ రవాణా కట్టడి కోసం అధికారులు కౌండిన్య నదిలో కందకాలు తవ్వుతున్నారు. నదీ సమీపంలోని వ్యవసాయ, ప్రైవేటు, మదరస్సాకు చెందిన భూములను అక్రమార్కులు వదలడం లేదు. పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్పందించి ట్రాక్టర్లు నదిలోకి రాకుండా కందకాలు తవ్వారు.

వైద్య శిబిరం
గుడుపల్లె, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరాన్ని గుడుపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం నిర్వహించారు. రోగులను పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 'మన చేతుల్లో మన ఆరోగ్యం' అనే విధంగా పలు సూచనలు, సలహాలు రోగులకు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు, న్యూస్‌టుడే:
సమస్య: పట్టణంలోని నగరివీధి, బజారు వీధిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. పాదాచారులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. – రామాంజులు, ట్యాంక్‌బండ్
సమాధానం: వర్షాలతో నెలకొన్న సాంకేతిక లోపాలను 24గంటల్లో పరిష్కరిస్తాం. – మధుసూదనరెడ్డి, కమిషనరు, పుంగనూరు

పుంగనూరు గ్రామీణ న్యూస్‌టుడే:
సమస్య: నెక్కుంది పంచాయతీ మొరంపల్లిలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
సమాధానం: గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. – బసవరాజు, కార్యదర్శి, నెక్కుంది

పలమనేరు, న్యూస్‌టుడే:
సమస్య: పట్టణంలోని బజారువీధి, జవిళివీధిలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. విద్యుత్తు అధికారులు తీగలను సరి చేయాలి. – శ్రీపురంసీతారామయ్య, పలమనేరు
సమాధానం: తీగలు సరి చేయడానికి చర్యలు తీసుకుంటాం. – సురేంద్ర, లైన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్తుశాఖ, పలమనేరు

శాంతిపురం, న్యూస్‌టుడే
సమస్య: శాంతిపురంలోని వ్యర్థాలను పాలారు నదిలో పారబోస్తున్నారు. దీంతో నదీజలాలు కలుషితమవుతున్నాయి. – కిషోర్, స్థానికుడు
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:
సమస్య: బేలుపల్లె-పట్నపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో చెరువు వద్ద మలుపులో విరిగిన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా వేలాడుతోంది. వాహన చోదకులు, పాఠశాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. – స్థానికులు, బేలుపల్లె
సమాధానం: స్తంభం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – హేమచంద్రుడు, ట్రాన్స్‌కో ఏఈ, బైరెడ్డిపల్లె

ప్రతి హామీ నెరవేరుస్తాం: చల్లా బాబు

మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చల్లా రామచంద్రారెడ్డి

సదుం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పుంగనూరు నియోజకవర్గ బాధ్యుడు చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, నాయకులు రెడ్డి ప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాళ్లబూదుగూరు, కెనమాకులపల్లె, అబకలదొడ్డి పంచాయతీల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. **కుప్పం గ్రామీణ:** రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా... ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి పేర్కొన్నారు. చెక్కునత్తం గ్రామంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.

వర్షాభావం.. అన్నదాతల్లో భయం
◆ అడుగంటిపోతున్న బోర్లు
◆ ఎండుముఖం పడుతున్న పంటలు


కాడేపల్లె వద్ద ఎండిపోయిన వరి పంట

న్యూస్‌టుడే, గుడుపల్లె: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వర్షాభావం వెంటాడుతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరు బావుల్లో నీరు లేక పంటలు ఎండుముఖం పట్టాయి. సెప్టెంబరులో కురవాల్సిన సాధారణ వర్షపాతం కేవలం 4.5మి.మీలకే పరిమితం కావడంతో మెట్ట పంటలతో పాటు బోర్ల కింద పంటలు ఎండిపోతున్నాయి. ఈసారి ఖరీఫ్ కష్టాలనే మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.


దాసేగౌనూరు చెరువు ఎండిపోయి ఇలా..


■ గుడుపల్లె మండలం కాడేపల్లెకి చెందిన ఆర్. దేవమ్మ మూడెకరాల విస్తీర్ణంలో టమాటా, మిరప, వంగ పంట వేశారు. రూ.లక్షన్నర అప్పుగా పెట్టుబడి పెట్టారు. ఇరవై రోజుల కిందట 590 అడుగుల లోతు వరకు తవ్విన బోరులో నీరు ఇంకిపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఒకటి రెండు కోతలకే టమోటా దిగుబడి నిలిచిపోగా.. మిరప, వంగ పూలు, పిందె దశలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


■ గుడుపల్లె మండలం యామగానిపల్లెకు చెందిన అర్జునప్ప రెండున్నర ఎకరాల భూమిలో బోరు కింద ఆహార ధాన్యాలతో పాటు అరెకరాలో పశుగ్రాసం సాగు చేసి నాలుగు పాడి ఆవులను పోషిస్తున్నారు. నెల కిందట బోరు ఇంకిపోవడంతో ఆహార ధాన్యాల పంటలపై ఆశలు వదులుకోగా... పాడిఆవుల పోషణ ప్రశ్నార్థకమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం, దాణా ప్రస్తుతం కొనలేని ధరలు అమ్ముతుండగా.. వచ్చే పాల కంటే మూడింతలు ఖర్చు చేసి పశువులను పోషిస్తున్నాని వాపోతున్నారు.

రైతులను ఆదుకుంటాం
ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలపై ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లో చేపడుతున్నాం. నష్టపోయిన రైతులను ఆదుకుంటాం.
– నాగరాజు, మండల వ్యవసాయాధికారి

ఇలా వెళ్లలేకున్నాం.. బస్సు పెట్టండి సారూ..!

ఐదేళ్లుగా చాలీచాలని బస్సులతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతుండేవారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఏర్పాటైన తర్వాత కుప్పం ఆర్టీసీ డిపో నుంచి గతంలో ఇతర డిపోలకు వెళ్లిన బస్సులు మళ్లీ డిపోకు చేరుకున్నాయి. వీటితో పాటు కొత్త బస్సులు వచ్చాయి. ఎన్ని బస్సులొచ్చినా 'మా కష్టం తీరడం లేదు' అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పం డిపోకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఇరుకుగా ఇలా ప్రమాదకరంగా విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం**

శునకాలతో పరేషాన్...!
పెద్దపంజాణిలో శునకాల బెడదతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చికెన్ దుకాణ నిర్వాహకులు వ్యర్థాలు పడేస్తుండడంతో శునకాలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**


పాడి పరిశ్రమ బలోపేతమే లక్ష్యం

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పక్కన కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పాడి పరిశ్రమ బలోపేతమే లక్ష్యంగా గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ డ్వామా, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డ్వామా, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేలా పాడి పరిశ్రమ అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 503 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. ◆ **కుప్పం పట్టణం:** తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసేందుకు తుంపర్ల బిందు, సేద్య పరికరాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు.

విస్తరణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
స్పందనకు వందనం
పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని విస్తరణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 14న 'ఈనాడు'లో 'ట్యాంకరు వస్తేనే బిందె నిండేది' 22న 'ఛిద్రంగా దారులు-తప్పని అవస్థలు' శీర్షికలతో మౌలిక వసతులపై కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిపాదనలు పంపాం
ఈనాడు కథనానికి స్పందన
పలమనేరు: సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించిన బకాయిల కోసం ప్రతిపాదనలు పంపినట్లు షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికార జిల్లా అధికారి డాక్టర్ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం 'ఈనాడు'లో 'భావితరాలకు వసతి తిప్పలు' శీర్షికతో ప్రచురించిన కథనానికి ఆ మేరకు స్పందించారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

పంట మార్పిడితో నష్ట నివారణ
వి.కోట, న్యూస్‌టుడే: పంట మార్పిడితో బంగాళదుంప రైతులకు నష్ట నివారణ సాధ్యమని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో, బైరెడ్డిపల్లె, వి.కోట రైతులకు బంగాళదుంప పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగాళదుంప సాగు చేసే రైతులు మొదట నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తన దుంపలను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఎండు తెగులు ఉన్న పొలంలో టమోటా, వంగ, మిరప, బంగాళదుంపకు బదులుగా క్యాబేజీ, బీన్స్, బంతి ఇతర పంటలు సాగు చేయడం ఉత్తమం అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, హెచ్‌వో లక్ష్మీప్రసూన పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి
సదుం, న్యూస్‌టుడే: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో దేవరాజు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న అర్షియాను దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు.

టిడ్కో గృహాల్లో వసతులు కల్పించండి
పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని గూడూరుపల్లెలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని భాజపా నాయకులు అయూబ్‌ఖాన్ డిమాండు చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా నిర్మించిన ఈ ఇళ్ల ప్రాంభోత్సవ శిలాఫలకంలో ప్రధానమంత్రి చిత్రం, పేరు లేకపోవడం దారుణమన్నారు. నాయకులు నరసింహులు, బాబు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం
బైరెడ్డిపల్లె: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యంతో జీవనం గడపవచ్చని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రమాదేవి అన్నారు. పౌష్ఠికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం బేలుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు.

సీఎంను కలిసిన ఇరికిపెంట మాజీ సర్పంచి

సోమల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబును మండలంలోని ఇరికిపెంట మాజీ సర్పంచి శ్రీనివాసులునాయుడు గురువారం విజయవాడలో కలిశారు. మండలంలో పెద్ద చెరువైన చెన్నపట్నంచెరువు అభివృద్ధి, గువ్వగుట్ట-ఇర్లపల్లెకు రోడ్డు తదితర అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేసినట్లు మాజీ సర్పంచి తెలిపారు.

కంటి అద్దాల పంపిణీ
కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో గత నెల 24 నుంచి ఈ నెల 3 వరకు ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం 565 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

చిరుతపులి సంచారం అవాస్తవం
కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలోని 102ఇ.రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొడిదపల్లె, కల్లూరు సమీప పొలాల్లో చిరుతపులి సంచరించిన విషయం అవాస్తమని జిల్లా అటవీశాఖ తూర్పు విభాగం రేంజర్ థామస్ సుకుమార్ గురువారం తెలిపారు. చిరుతపులి సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు ఉంటాయని, కానీ ఇక్కడ కాలిగోళ్లు ఉన్నాయని నక్క, తోడేలు, హైనా వన్యప్రాణులు సంచరించి ఉండవచ్చన్నారు.

'కులాలను రెచ్చగొడుతున్నారు'
పలమనేరు, న్యూస్‌టుడే: ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కులాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షుడు డీవీ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

నంజంపేటలో స్వచ్ఛతా హీ ర్యాలీ
సోమల, న్యూస్‌టుడే: మండలంలోని నంజంపేటలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కుసుమాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులు మంచి విలువలు కలిగి ఉండాలి
కల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చక్కగా చదువుకుని. . తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించి సమాజంలో గొప్ప విలువలు కలిగి ఉండాలని డీఈవో దేవరాజులు, కల్లూరు సీఐ సూర్యనారాయణ, కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. కల్లూరు జడ్పీ పాఠశాలలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.


వరద బాధితులకు నగదు అందిస్తున్న పుంగనూరు ఆర్య వైశ్య సంఘ నాయకులు

వరద బాధితులకు నగదు, దుస్తుల పంపిణీ
పుంగనూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు పుంగనూరు ఆర్యవైశ్య సంఘ తరపున రూ.5.50లక్షల నగదు, దుస్తులు అందించారు. గురువారం ఊర్మిళ నగర్‌లో ఇంటింటికి వెళ్లి నగదు, దుస్తులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. నిరాశ్రయులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విజయకుమార్, ఆర్వీ బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పారితోషికం అందజేత

ఎన్‌సీసీ విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై శ్రీనివాసులు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని గుడివంకలో బందోబస్తు కార్యక్రమంలో పాల్గొన్న కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయ ఎన్‌సీసీ విద్యార్థులకు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లి ఎస్సై శ్రీనివాసులు గురువారం పారితోషికం అందించారు.

గుడుపల్లె, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు-నివారణకు ఉపాయాలు అనే అంశంపై గురువారం మండల పరిధిలోని గుడివంక కొండపై ఎన్‌సీసీ విద్యార్థులకు గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు అవగాహన శిక్షణా తరగతులు నిర్వహించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

చలపతి (పాతచిత్రం)

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ చలపతి(50) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. గంగవరం శ్రీనివాసనగర్‌లోని ఆయన నివాసంలో ఒంటరిగా ఉన్న సమయంలో గుండె నొప్పి రావడంతో ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ప్రధానోపాధ్యాయుడు..

సుధాకర్‌నాయుడు (పాతచిత్రం)

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని చింపిరెడ్డిపల్లె ఏఎన్ఎం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌నాయుడు(59)కు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఎంఈవోలు శ్రీరాములు, శివరత్నమ్మ, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఆయన మృతికి నివాళులు అర్పించారు.


వినతులు నమోదు చేసుకుంటున్న జనం

వినతుల వెల్లువ
కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కాళ్లరిగేలా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని.. తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధితాధికారులను ఆదేశించారు.

భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారు..

నాకు రామకుప్పం మండలం మణీంద్రంలో సర్వే నం. 231/5సిలో ఎ.0.10 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించారు. దీనిపై తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తే కుటుంబ తగాదా అని కేసు నమోదు చేశారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నా భూ ఖాతాను తొలగించారు. న్యాయం చేయాలి. **- కుమార్, రామకుప్పం**

రీ-సర్వేలో భూమి తగ్గింది

మా కుటుంబ ఆస్తులను నేను, నా సోదరులు భాగ పంపకాలు చేసుకున్నాం. నా భాగానికి ఎ.2.63 సెంట్లు వచ్చింది. రీ-సర్వే తర్వాత ఆన్‌లైన్‌లో ఎ.1.07 సెంట్లు మాత్రమే ఉన్నట్లు చూపుతోంది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయింది. **- జనార్దన్‌రెడ్డి, బొమ్మనపల్లె, శాంతిపురం**

రూ.లక్షల వ్యయం.. వినియోగానికి దూరం
☛ వైద్య సిబ్బంది, రోగులకు తప్పని అవస్థలు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని దండికుప్పం గ్రామ పంచాయతీ కేంద్రానికి సమీపంలోని కొండపల్లె వద్ద ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రభుత్వం నిర్మించిన 'వెల్‌నెస్' ఆరోగ్య భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది.

■ **23 పంచాయతీల్లో..**

మండల పరిధిలోని 23 పంచాయతీల్లో వైకాపా ప్రభుత్వం ప్రచార ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు రూ.లక్షల వ్యయం ఖర్చు చేసింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో.. ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్‌లు చాలా చోట్ల నామమాత్రంగా కొనసాగుతున్నాయి.


దండికుప్పం వద్ద మూతపడిన వెల్‌నెస్ సెంటర్ భవనం

■ **జనావాసాలకు దూరంగా..**

నాయకులు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ భవనాలు నిర్మించారు. జనావాసాలకు దూరంగా నిర్మించిన భవనాలు చాలా చోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల ప్రారంభించినా.. వినియోగానికి నోచుకోలేక మూతపడ్డాయి. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల రహదారులు, విద్యుత్తు, నీటి వసతి లేక వినియోగించని పరిస్థితి.

■ **మూలకు చేరిన సామగ్రి**

సచివాలయాల్లో వెల్‌నెస్ సెంటర్లు నిర్వహించడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యం కోసం ప్రత్యేకంగా గదులు లేక రోగులకు, సిబ్బందికి అసౌకర్యం ఎదురవుతోందని ప్రజలు వాపోతున్నారు. ప్రతి కేంద్రానికి ప్రభుత్వం రూ.లక్షల విలువైన సామగ్రి సమకూర్చినా.. వాటిని వినియోగించక.. సచివాలయాల్లో మూలన పడేయాల్సిన దుస్థితి దాపురించిందని సిబ్బంది పేర్కొన్నారు.


కెనమాకులపల్లె గ్రామ సచివాలయంలో వెల్‌నెస్ కేంద్రం నిర్వహణ

మండల పరిధిలోని కెనమాకులపల్లె పంచాయతీలోని గ్రామ సచివాలయ భవనంలో కొనసాగుతున్న 'వెల్‌నెస్' కేంద్రం ఇది. సచివాలయానికి సమీపంలో నిర్మించినా.. వినియోగించలేదు. సచివాలయంలో ఓ వైపు ఉద్యోగులు.. మరోవైపు వెల్‌నెస్ నిర్వహణ వల్ల సిబ్బందితోపాటు రోగులకు అసౌకర్యం తప్పడం లేదు. మండల వ్యాప్తంగా చాలా పంచాయతీల్లో ఇదే దుస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం
వెల్‌నెస్ భవనాల వినియోగానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- వైద్యాధికారి వంశీకృష్ణ**

మహిళపై దాడి
పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని మహిళపై దాడి చేసిన ఘటన గురువారం జరిగింది. ఉలవలదిన్నెకు చెందిన సహదేవకు ఇద్దరు భార్యలు. రెండో భార్య చౌడమ్మ (45)ను పెద్ద భార్య గంగులమ్మ కుటుంబ సభ్యులు మధు, రెడ్డమ్మ, జయమ్మలు దాడి చేసి గాయపరిచారు. పోలీసులకి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

టపాసులు స్వాధీనం
సోమల: అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్టు చేసి రూ.1.36లక్షల విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివశంకర్ గురువారం తెలిపారు. కోటగుండ్లపల్లెకు చెందిన వెంకట్రామణారెడ్డి ఇంట్లో నిల్వ ఉంచిన టపాసులను వీఆర్వో జీవనజ్యోతి సమక్షంలో సీజ్ చేసి వెంకట్రమణారెడ్డి, రాకేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. **కల్లూరు:** కల్లూరులో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.2.50 లక్షల టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు.